క్లుప్తంగా

రైతుభరోసా అర్హుల జాబితా ప్రదర్శన



జాబితాను పరిశీలిస్తున్న రైతులు

ఆత్మకూరు: స్థానిక రైతు భరోసా కేంద్రంలో వైఎస్సార్ రైతు భరోసాకు అర్హులైన వారి ప్రదర్శనకు ఉంచారు. ఆర్బీకే చైర్మన్ బైరాపురం మహబూబ్ బాషా మాట్లాడుతూ మండలంలో 28 మంది కొత్త రైతుల పేర్లను నమోదు చేశామన్నారు. జాబితాలోఏవైనా తప్పులుంటే సరి చూసుకోవాలని రైతులను కోరారు.

వేసవి శిబిరాలను వినియోగించుకోండి

పగిడ్యాల: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయంలో ఈనెల 8 నుంచి ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ మద్దమ్మ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. వేసవి క్యాంప్‌లకు 5 నుంచి 15 ఏళ్ల వయస్సు కలిగిన విద్యార్థులు పాల్గొనాలన్నారు. కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఉత్సాహవంతులైన వారు రిసోర్స్ పర్సన్‌గా ఉండేందుకు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

నివాళి

శ్రీశైలంప్రాజెక్ట్: ఉమ్మడి కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆసాది వసంతరావు 8వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సున్నిపెంటలో వసంతరావు ఇంటి వద్ద పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. 2015 మే15న ఆయన హత్యకు గురైన విషయం తెలిసిందే.

అందుబాటులో 'విద్యా కానుక' కిట్లు

పగిడ్యాల: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన జగనన్న విద్యా కానుక కిట్లు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని ఎంఈఓ సుభాన్ తెలిపారు. సోమవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో నిల్వ ఉంచిన యూనిఫాం నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలానికి రావాల్సిన మొదటి విడత పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. యూనిఫాం నాణ్యతతో ఉన్నాయని వాటిని కుట్టించుకోవడానికి కూడా ప్రభుత్వం తల్లిదండ్రుల ఖాతాలకు డబ్బులు జమ చేస్తుందని చెప్పారు. ప్రిన్సిపాల్ సుజన, ఏపీఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం లారీ

మహానంది: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీ స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు మహానంది ఎస్‌ఐ జి.నాగేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు పట్టణానికి చెందిన హసన్‌బాషా, పెద్దమద్దిలేటి పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా బుక్కాపురం వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. 220 బ్యాగుల్లో సుమారు 10,120 కిలోల బియ్యాన్ని సీజ్ చేశారు. వీరికి సహకరించిన నలుగురు వ్యక్తులను విచారిస్తామన్నామని చెప్పారు.

వేతనాల చెల్లింపు

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేసే విద్యా వలంటీర్లకు పూర్వ విద్యార్థులు సోమవారం వేతనాలను అందజేశారు. తెలుగు,హిందీ బోధిస్తున్న వలంటీర్లకు 1984వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆలేటి మల్లికార్జున, భోగ్యం వెంకటేశ్వర్లు తమ బ్యాచ్ తరఫున రెండు నెలల గౌరవ వేతనాన్ని అందజేశారు.

సామాజిక తనిఖీ నిష్పక్షపాతంగా చేయాలి

కొత్తపల్లి: మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై చేస్తున్న సామాజిక తనిఖీ నిష్పక్షపాతంగా చేయాలని ఎంపీడీఓ మేరి, ఏపీఓ రాజునాయక్ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో కో–ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సామాజిక తనిఖీ సిబ్బందికి ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో సహకారం అందించాలని ఆదేశించారు. ఈసీ శ్రీనివాసులు, ఎస్ఆర్పీ మణికంఠ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం



నాగమ్మ

జూపాడుబంగ్లా: మండలంలోని మండ్లెం గ్రామానికి చెందిన వడ్డె నాగమ్మ (75) ఆదివారం కనిపించకుండా పోయింది. తల్లి ఆచూకీ కోసం బంధువులు, గ్రామంలో విచారించినా ప్రయోజనం లేకపోవటంతో సోమవారం జూపాడుబంగ్లా పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకొని గాలింపు ప్రారంభించినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

సాగుకు ఊతం

- ఆర్బీకేలకు చేరుకుంటున్న ఎరువులు
- నెలాఖరు నాటికి రైతుల ఖాతాల్లో 'రైతు భరోసా' సొమ్ము
- సేద్యం పనుల్లో అన్నదాత బిజీ



ఖరీఫ్ సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతన్న

ఆత్మకూరు: ఈ ఏడాది రైతులు ముందస్తు ఖరీఫ్‌నకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం గత పంటల అవశేషాల తొలగింపు, ఎండకారు సేద్యం, సేంద్రియ ఎరువులు చల్లే పనుల్లో బిజీగా ఉన్నారు. ఇక ప్రభుత్వం కూడా రైతుల అవసరాలకు సరిపడ ఎరువులు, మందులను ఆర్బీకేలకు చేరవేస్తోంది. ఇప్పటికే ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల ప్రారంభం నుంచే వర్షాలు కురుస్తుండటంతో పొలాలను సాగుకు సిద్ధం చేస్తున్నారు.

ప్రారంభమైన విత్తులు..

మండలంలో ముందస్తు వర్షాలు కురవడంతో రైతులు మొక్కజొన్న,పత్తి విత్తనాలు విత్తు వేశారు. నల్లకాల్వ, కరివేన, బాపనంతపురం, వెంకటాపురం, కురుకుంద గ్రామాల్లో పత్తి, మొక్కజొన్న పంటలను 10 శాతం పైగ రైతులు విత్తారు. సిద్దాపురం చెరువు నీరు, బోరుబావుల కింద విత్తనాలు వేశారు. ఖరీఫ్‌లో రైతులు అత్యధికంగా మొక్కజొన్న పత్తి పంట సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

రైతు భరోసా కేంద్రాలకు చేరుకుంటున్న ఎరువులు, విత్తనాలు..

రైతు భరోసా కేంద్రాల్లో జీలుగ, మినుము, కంది, పెసర విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. ఎరువులు సైతం కేంద్రాలకు చేరుతున్నాయి.

త్వరలో 'రైతు భరోసా'..

ఖరీఫ్ సాగుకు పెట్టుబడి సాయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద రూ.7,500 ఈనెలాఖరులో అందజేయనుంది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చే స్తున్నారు. ఆత్మకూరు మండలంలో 7,401 మంది రైతులకు రూ.4,10,59,500, బండిఆత్మకూరు మండలంలో 8,331 మంది రైతులకు రూ.4,59,14,500, మహానంది 4,245 మంది రైతులకు రూ.2,33,97,500, వెలుగోడు మండలంలో 5,770 మంది రైతులకు రూ.3,17,37,000 ఖాతాల్లో జమ చేయనుంది.

అర్హులందరికీ రైతు భరోసా వర్తింపజేస్తాం



అర్హులైన రైతులందరికీ రైతు భరోసా అందేలా చూస్తాం. ఇప్పటికే ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఏ ఒక్క అర్హుడికి కూడా అందకుండా ఉండరాదని చెప్పింది. ఆత్మకూరు మండలంలో 7,401 మంది రైతులు అర్హత పొందారు. వీరికి ఈ నెల చివరిలో సొమ్ము అందే అవకాశముంది. ఇక ఎరువులు, పిల్లిపెసర విత్తనాలు ఆర్బీకేలకు చేరుతున్నాయి. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– విష్ణువర్ధన్‌రెడ్డి, వ్యవసాయ అధికారి

మహానందీశ్వరుడికి పల్లకోత్సవం



మహానందిలో పల్లకీ సేవ దృశ్యం

మహానంది: శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లకు సోమవారం రాత్రి మహానందిలో పల్లకోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, రవిశంకర అవధాని, అర్చకులు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార హారతులు ఇచ్చారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ముక్కోటి దేవతలకు నిలయమైన గోమాతను అలంకరించి ఉత్సవం ముందు నడిపిస్తూ.. ఆలయ ప్రాకారంలో ఊరేగించారు.

తప్పిన ప్రమాదం



ట్రాక్టర్ బోల్తా పడిన దృశ్యం

మిడుతూరు: రోళ్లపాడు మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ఓ ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పరమటూరు నుంచి వరిగడ్డి లోడ్‌తో ట్రాక్టర్ నందికొట్కూరుకు వెళ్తుండగా.. అలగనూరు గ్రామ సచివాలయంలో ఇంజినీర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎంఎస్ రూపేస్ కుమార్ ద్విచక్రవాహనంపై అలగనూరుకు వెళ్తున్నాడు. రోళ్లపాడు మలుపు వద్ద ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి ట్రాక్టర్ బోల్తా పడింది. ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ పెద్ద ఖాసింకు గాయాలు కావడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇంజినీర్ అసిస్టెంట్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ఆర్థిక సాయం

కొత్తపల్లి: పెద్దగుమ్మడాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కదిరి శేషన్న భార్య కదిరి రాధమ్మ ఆదివారం రాత్రి పురుగు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. సోమవారం ఎమ్మెల్యే ఆర్థర్ ఆధ్వర్యంలో తొగట నాగర్జున ప్రసాద్ ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల నగదు సాయంగా అందజేశారు. జక్కుల రాము, మల్లయ్య, రామకృష్ణ, పుల్లయ్య యాదవ్ ఉన్నారు.

మహాకుంభాభిషేకోత్సవానికి ఆహ్వానం





మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ధర్మానప్రసాదరావును ఆహ్వానిస్తున్న ఈఓ, పండితులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే మహాకుంభాభిషేక మహోత్సవానికి సోమవారం విజయవాడలో రాష్ట్ర అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.జవహర్‌రెడ్డిని కలిసి ఈఓ ఎస్.లవన్న ఆహ్వానించారు. ఆయన వెంట స్వామివారి ఆలయ ప్రధానార్చకులు హెచ్.వీరయ్యస్వామి, అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు పి.మార్కండేయస్వామి, సీనియర్ వేదపండితులు గంటి రాధాకృష్ణమూర్తి, అధ్యాపకులు ఎం.పూర్ణానందస్వామి ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రులు, ప్రధాన కార్యదర్శికి వేదాశీర్వచనంతో పాటు శేషవస్త్రాలు,ప్రసాదాలను అందజేశారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట



సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



స్థలదాతలను సన్మా నిస్తున్న ఎమ్మెల్యే, వైద్య బృందం

నందికొట్కూరు: పేదల ఆరోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో నూతనంగా నిర్మించిన 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. అంతకుముందు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో పురోహితులు స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగనన్న దేశంలో ఎక్కడా లేని విధంగా 2 వేలపైగా రోగాలకు ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చారని చెప్పారు. నూతనంగా ఆరోగ్యశ్రీ లబ్ధిదారులైన గర్భిణులకు అత్యాధునిక టిఫా స్కానింగ్ ఉచితంగా చేసేందుకు శ్రీకారం చుట్టారన్నారు. టిఫా స్కానింగ్ ద్వారా గర్భంలోని బిడ్డ లోపాలను గుర్తించవచ్చని చెప్పారు. నారా లోకేష్ పాదయాత్రలో నోటికి వచ్చినట్లు ఆరోపణలు గుప్పించడం తగదన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను విమర్శించే స్థాయి లోకేష్‌కు లేదన్నారు. అనంతరం స్థల దాతను ఎమ్మెల్యే, వైద్య బృందం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఏరియా కో ఆర్డినేటర్ జఫ్రుల్లా, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమాదేవి, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, కమిషనర్ కిశోర్, వైస్ చైర్మన్ ప్రశాంతి, తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, ఎంపీడీఓ శోభరాణి, వైద్యాధికారులు రాయుడు, ప్రసాద్, ఇంజినీరు కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు లాలు ప్రసాద్, సుమలత, చాంద్‌బాషా, రఫూఫ్, నాయబ్, హామీద్, జాకీర్ హుసేన్, ధర్మారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు గఫార్, వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ సెల్ ఇన్‌చార్జి అబూబక్కర్, నాయకులు డాక్టర్ వనజ, ఉస్మాన్‌బేగ్, కుర్వ శ్రీను, భాస్కరరెడ్డి, అయ్యన్న, ఆర్ట్ శ్రీను, వీఆర్ శ్రీను, తర్నం, ఇనాయతుల్లా పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



గాజులపల్లెలో దివ్యాంగుడి సమస్య వింటున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: పేదల అభ్యున్నతికి, రాష్ట్ర పురోభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. గాజులపల్లె గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల స్థలాలు కావాలని, డ్రైనేజీలు నిర్మించాలని, ఇళ్ల రుణం అందించాలని స్థానికులు కోరడంతో వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన కులమతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలను అందిస్తూ పారదర్శక పాలన అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు.

సీఎం సహాయనిధి వరం లాంటిది..

సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే తెలిపారు. గాజులపల్లెకు చెందిన అశోక్‌కు ఎల్‌ఓసీ ద్వారా రూ.4లక్షలు మంజూరు చేయించి కర్నూలు ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించారు. దీంతో వారి ఇంటి వద్ద ఎమ్మెల్యే శిల్పాను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, సర్పంచ్ గడ్డం చంటి, గోపవరం సొసైటీ చైర్మన్ వి.రామకృష్ణుడు (కిట్టు), వైఎస్సార్‌సీపీ నేత కొండా మధుసూదన్‌రెడ్డి, మండల కన్వీనర్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి ఎంపీటీసీ సభ్యుడు చౌటుపల్లి నరసింహుడు, నేతలు గజ్జా పెద్ద ఫక్కీరయ్య, వీఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మీనిగ నారాయణ, బొజ్జయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మిట్టకందాలలో చోరీ

పాములపాడు: మండలంలోని మిట్టకందాల గ్రామంలో నల్లకొండ వెంకటేశ్వర్లు ఇంటి మిద్దెపై నిద్రిస్తుండగా సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని రూ.6 లక్షల నగదు, రెండు తులాల బంగారు నగలు దోచుకెళ్లారని ఎస్‌ఐ అశోక్ తెలిపారు. తెల్లవారుజామున వారు కిందికి దిగి వచ్చి చూడగా ఇంటి తలుపు, బీరువా తెరిచి ఉండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ సిబ్బందితో వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మూర్వకొండ ఘాట్ పరిశీలన

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోనున్న మూర్వకొండ ఘాట్‌ను నందికొట్కూరు రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి సోమవారం సాయంత్రం పరిశీలించారు. కృష్ణానదిలో ఇంజిన్ బోట్ల ప్రయాణాన్ని ప్రభుత్వం నిషేధించిందని, తెలంగాణ రాష్ట్రం మంచాలకట్ట ఘాట్‌కు, చెల్లపాడుకు వెళ్లే ప్రయాణికులు నదిలో ప్రయాణం చేయకుండా బస్సు మార్గం ద్వారా వెళ్లాలని సూచించారు. నదిలో బోట్లు తిప్పితే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని ఘాట్ నిర్వాహకులను హెచ్చరించారు. ముచ్చుమర్రి ఎస్‌ఐ నాగార్జున, సిబ్బంది ఉన్నారు.

రేపటి నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం'

మహానంది: బండిఆత్మకూరులో బుధవారం నుంచి మూడు రోజుల పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బుధ, గురు, శుక్ర, శనివారాల్లో నాలుగు రోజుల పాటు మధ్యాహ్నం మూడు గంటల నుంచి కార్యక్రమం ఉంటుందన్నారు.

నేడు గాజులపల్లెలో..

గాజులపల్లె గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని పార్టీ మండల కన్వీనర్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

సంతకాల సేకరణ

మహానంది: రాయలసీమ వాసుల హక్కుల కోసం సీమ జిల్లాల్లో సంతకాల సేకరణ కార్యక్రమం చేపడుతున్నట్లు రాయలసీమ స్టీరింగ్ కమిటీ నాయకులు రమణారెడ్డి తెలిపారు. గాజులపల్లెలో సోమవారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాయలసీమలోని 52 నియోజకవర్గాలో మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పర్యటించనున్నట్లు చెప్పారు.

స్పందనలో సమస్యలు పరిష్కరించుకోండి



స్పందన కార్యక్రమంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

జూపాడుబంగ్లా: ప్రజలు తమ సమస్యలను స్పందన కార్యక్రమంలో వినతి పత్రాలు అందజేసి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ మంజులవాణి తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారుల అధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రం, నియోజకవర్గ కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేదని, గ్రామ, మండల కేంద్రాల్లో వినతులు అందజేయాలని సూచించారు. అర్జీలను ఆయా శాఖల మండలస్థాయి అధికారుల సమక్షంలో పరిష్కరిస్తామన్నారు. ఈఓపీఆర్డీ మణిమంజరి, ఏఈలు బషీర్, రామాచారి, శ్రీనాథ్, నాగేంద్ర, ఎంఈఓ మోహన్, ఏఓ కృష్ణారెడ్డి, ఏపీఓ గౌరీబాయి, ఏపీఎం అంబమ్మ పాల్గొన్నారు.

నైపుణ్యాలు మెరుగు పరుచుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్



శిక్షణకు హాజరైన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు

మిడుతూరు: ఉపాధ్యాయులు శిక్షణలో నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని కర్నూలు జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్ సూచించారు. సోమవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో 2018 డీఎస్సీకి ఎంపికైన స్కూల్ అసిస్టెంట్ సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులకు రాష్ట్రవ్యాప్తంగా ఇండక్షన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఐదు రోజుల పాటు జరిగే శిక్షణలో రిసోర్స్ పర్సన్లు బోధనలో మెళకువలు, సులభరీతిలో మ్యాప్ పాయింటింగ్ గుర్తించడం, వెనుబడిన విద్యార్థుల పట్ల అనుసరించాల్సిన బోధన విధానాలు తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారని చెప్పారు. ఎంఈఓ మౌలాలి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సలీంబాషా, రిసోర్సు పర్సన్లు, నాలుగు జిల్లాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాస్తవ సమాచారంతో సమావేశానికి రండి

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సమావేశానికి అసంపూర్తి సమాచారంతో రావద్దని కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి అన్నారు. సోమవారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17 వ తేదీన సీఎండీ సంతోషరావు ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించనున్నారని, ఈ సమావేశానికి వాస్తవ సమాచారం, గణంకాలతో రావాలని సూచించారు. ముఖ్యంగా నెలవారి విద్యుత్ బిల్లుతో పాటు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల వివరాలు, 9గంటల నిరంతర విద్యుత్ సరఫరా, ఎస్టిమేట్లు, పనుల పూర్తి, వర్క్ ఆర్డర్ల క్లోజింగ్ వంటి వివరాలు వాస్తవంగా ఉండాలన్నారు. మొక్కుబడి సమాచారం, తప్పుడు గణంగాలతో వస్తే సహించబోమని వెల్లడించారు. దీనిపై ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఏఈలు అప్రమత్తం కావాలని సూచించారు.


గ్రామాల్లో సమస్యలు లేకుండా చూస్తాం



బండినాయిని పాలెంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్థర్

కొత్తపల్లి: ప్రజల సంక్షేమం మా బాధ్యత, గ్రామాల్లో సమస్యలు లేకుండా చూస్తామని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ తెలిపారు. సోమవారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామ సచివాలయ పరిధిలోని చదరంపెంట, పాలెంచెరువు, ఎర్రగుంట గూడెం, బండినాయిని పాలెం, గువ్వలకుంట్లలోని పలు కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనా ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరిస్తూ, బుక్‌లెట్ అందజేశారు. ప్రజల నుంచి సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. చదరంపెంట, ఎర్రగుంట గూడేల్లో విద్యుత్ స్తంభాలు, రోడ్లులేక ఇబ్బందులు పడుతున్నామని, పక్కాగృహాలు, స్థలాలు లేవని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. బండినాయిని పాలెంలో విద్యుత్ స్తంభాలు లేవని, పలు చోట్ల విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయని, గ్రామం నుంచి చదువుకోసం కొత్తపల్లికు వెళ్లడానికి విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. గువ్వలకుంట్ల బీసీ కాలనీలో విద్యుత్ వైర్లు ఇళ్లపై వేలాడుతున్నాయని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని వారికి హామీనిచ్చారు. అధికారులు గ్రామాల్లో పర్యటించకపోతే సమస్యలు తెలియక ఇంకా ఎక్కువయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. గువ్వలకుంట్ల ఎంపీటీసీ స్రవంతి మాట్లాడుతూ గువ్వలకుంట్ల నుంచి పాలెంచెరువు గూడెం వరకు రహదారి అధ్వానంగా తయారై రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని రహదారి నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డు నిర్మాణం చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మేరి, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఎంఈఓ శ్రీరాములు, ఈఓఆర్డీ శ్రీనివాసులు నాయుడు, ఏపీఎం పుల్లయ్య, ఏపీఓ రాజునాయక్, విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ రాజు, ఏఈలు రామచంద్రయ్య, త్రిలింగేశ్వరరెడ్డి, సర్పంచులు చంద్రశేఖర్ యాదవ్, కలబండి మారెన్న, విజయ్‌కుమార్, నాయకులు జీఎండీ రఫీ, సహదేవుడు, మీసాల వెంకటరెడ్డి, మల్లికార్జున యాదవ్, సాయిరాం, ఓబులేసు, జక్కరయ్య, ఎల్లయ్య, కుమార్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య



మృతి చెందిన కదిరి రాధ

నందికొట్కూరు: మండలంలోని నాగటూరు గ్రామానికి చెందిన మహిళ కదిరి రాధ (35) మానసిక వ్యాధితో బాధపడుతూ పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఎన్వీ రమణ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మచ్చ ఓబులస్వామి, వేణమ్మ దంపతుల కుమార్తె రాధికను 15 ఏళ్ల క్రితం కొత్తపల్లి మండలంలోని పెద్ద గుమ్మాడాపురం గ్రామానికి చెందిన కదిరి శేషన్నకు ఇచ్చి వివాహం చేశారు. మూడేళ్ల నుంచి ఆమె మానసిక వ్యాధితో బాధపడుతుండేది. పలువురు వైద్యులకు చూపించినా నయం కాలేదు. దీంతో నెల క్రితం ఆమె తండ్రి పుట్టింటికి తీసుకొచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి పురుగు మందు సేవించడంతో కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు 108లో తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందింది. తండ్రి ఓబులస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కేసు నమోదు..

నాగటూరు గ్రామానికి చెందిన ఓ మహిళను వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ మల్‌రెడ్డి చెన్నయ్య సోమవారం తెలిపారు. రెండు నెలల నుంచి ఫోన్ చేసి వేధిస్తుండటమే కాకుడా బెదిరిస్తున్నాడని బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

సుంకులాపరమేశ్వరికి జలాభిషేకం

నంద్యాల వ్యవసాయం: పట్టణంలోని కోట వీధిలో వెలసిన శ్రీ సుంకులా పరమేశ్వరి దేవి చండీ ఉత్సవాన్ని పురస్కరించుకుని మొదటి రోజు సోమవారం అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. తెల్లవారు జామునే మహిళలు చిన్న చెరువు నుంచి గంగా జలాన్ని మేలతాలాలతో తీసుకొచ్చి వేద పండితుల ఆధ్వర్యంలో జలాభిషేకం చేశారు. అనంతరం సామూహిక కుంకుమార్చన నిర్వహించి మహా మంగళహారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంకాలం ప్రదోష పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ లోక కల్యాణార్థం చండీ యాగం నిర్వహిస్తున్నామని తెలిపారు. మంగళవారం అమ్మవారికి క్షీరాభిషేకం, చండీ హోమం, సాయంత్రం కుంకుమార్చన, బుధవారం చండీ హోమం జరిపించి, పూర్ణాహుతి, సాయంత్రం గ్రామోత్సవం ఉంటుందని వివరించారు.